
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 9 । జూలై । 2023



యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం
జిల్లాలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం జరుగుతున్నా ఆ శాఖ అధికారులు అరికట్టలేకపోతున్నారు. 8లో



అతి వేగమే కారణమా ?
మణుగూరు-కొత్తగూడెం రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదానికి అతి వేగమే కారణమని తెలుస్తోంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం
జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్పీతో విప్ రేగా భేటీ



ఎస్పీతో మాట్లాడుతున్న రేగా కాంతారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం ఎస్పీ డాక్టర్ వినీత్‌తో భేటీ అయ్యారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, శాంతిభద్రతల పరిరక్షణలో తీసుకుంటున్న చర్యలపై చర్చించారు.

పెదవాగు పనుల పరిశీలన



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఈఈ

అశ్వారావుపేటరూరల్: గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్ట్ గేట్లకు రూ.1.23 కోట్లతో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను నీటి పారుదల శాఖ ఈఈ సురేష్‌కుమార్ శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేసిన ఈఈ, మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణ, ఏఈ కేఎస్‌బీ కృష్ణ పాల్గొన్నారు.

జూనియర్ కెమిస్ట్ పోస్టులకు నేడు రాత పరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఖాళీగా ఉన్న జూనియర్ కెమిస్ట్ (ఇంటర్నల్) పోస్టులకు కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో ఆదివారం రాత పరీక్ష నిర్వహించనున్నట్లు పర్సనల్ జీఎం(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చిలో నోటిఫికేషన్ ఇవ్వగా సింగరేణి వ్యాప్తంగా సుమారు 500 మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని పరిశీలించి 492 మందికి హాల్‌టికెట్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఎస్సెస్సీ సప్లిమెంటరీలో పెరిగిన ఫలితాలు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు మరింత మెరుగయ్యాయని ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు వెల్లడించారు. ఇటీవల జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 31 ఆశ్రమ పాఠశాలలు, 15 వసతి గృహాలు, ఒక బెస్ట్ అవైలబుల్ స్కూల్ నుంచి 526 మంది పరీక్షలకు హాజరు కాగా, ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. మొత్తంగా 78.14శాతం ఉత్తీర్ణత నమోదయ్యేందుకు కృషి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వార్డెన్లను పీఓ ఓ ప్రకటనలో అభినందించారు.

రైళ్ల రద్దు పొడిగింపు

కొత్తగూడెంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈ పొడిగింపు మరికొద్ది రోజులు అమల్లో ఉంటుందని వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం రైళ్లు ఆదివారం ప్రారంభం కావాల్సి ఉన్నా పనులు పూర్తి కాకపోవడంతో 16వ తేదీ వరకు రైళ్లను రద్దు చేస్తున్నామని ఖమ్మం సీసీఐ జాఫర్, కొత్తగూడెం చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ తెలిపారు. డోర్నకల్-విజయవాడ (07755), విజయవాడ-డోర్నకల్(07756), భద్రాచలం రోడ్ - విజయవాడ(07278), విజయవాడ-భద్రాచలంరోడ్(07279) రైళ్లు నడవవనే విషయాన్ని గమనించాలని సూచించారు.

నేడు గిరిజన ఉపాధ్యాయుల సదస్సు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని రెడ్డి సత్రంలో ఆదివారం నిర్వహించే ట్రైబల్ వెల్ఫేర్ టీచర్ల సదస్సును జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు కోరారు. ఉపాధ్యాయుల సమస్యలపై ఈ సదస్సులో చర్చించనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు.

రేపు వరుణయాగం

ఖమ్మంగాంధీచౌక్: వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ కామేపల్లి మండలం పాత లింగాలలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో జిల్లా ధూప దీప నివేదన అర్చక సంఘం ఆధ్వర్యాన సోమవారం వరుణ యాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, రుత్విక వరుణ జపం, హోమం, రుద్రాభిషేకం, పూర్ణాహుతి, ఉంటాయని సంఘం బాధ్యులు తెలిపారు. ఈమేరకు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నావఝ్జల ప్రసాద్‌శర్మ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునిగలేటి రమేష్‌శర్మ, మరింగంటి భార్గవాచార్యులు కోరారు.

కోరగుట్ట నేచర్ పార్క్ ఇదే




సండే స్పెషల్

ఆహ్లాదం.. ఆనందం

పర్యాటకులకు కనువిందు చేయనున్న కోరగుట్ట
- నేచర్ పార్క్‌గా తీర్చిదిద్దుతున్న అటవీ శాఖ
- చుట్టూ వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్ల ఏర్పాటు
- ప్రారంభానికి సిద్ధంగా ఉద్యానవనం

ఇల్లెందు: ఇల్లెందుకు ఈశాన్యం దిక్కునున్న కోరగుట్ట అరిష్టం అని ఒకప్పుడు అనేవారు. కానీ ఇప్పుడా గుట్ట మిషన్ భగీరథ పథకం ట్యాంకులకు నిలయమైంది. ఈ గుట్ట మీద నుంచే ఇల్లెందు నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు కారేపల్లి మండలానికి గోదావరి జలాలు వెళుతున్నాయి. ఇక ప్రస్తుతం అదే కోరగుట్టను 'ఇల్లెందు నేచర్ పార్క్'గా అటవీ శాఖ తీర్చిదిద్దింది. ఊరగుట్ట బీట్‌లో 115 హెక్టార్లలో రూ.60 లక్షలతో పార్క్ నిర్మించింది. ఈ గుట్ట సందర్శకులను ఆకట్టుకోవడమే కాక పట్టణానికి కలికితురాయిగా మారనుంది. అంతే కాక పట్టణవాసులకు వ్యాయామం, వాకింగ్ చేయడంతో పాటు ఆహ్లాదం పంచేందుకు ఉపయోగపడనుంది. పార్క్‌లో అక్కడక్కడా సోలార్ లైట్లు, నీటి కోసం బోర్లు, మోటార్లు ఏర్పాటుచేశారు.

కోరగుట్ట నేచర్ పార్క్ బోర్డు



చుట్టూ ఫెన్సింగ్..


పార్క్‌లోకి పశువులు, స్మగర్లు రాకుండా కోరగుట్ట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. గుట్ట సమీపంలో గిరిజనేతర రైతులు ఆక్రమించుకుని పోడు సాగు చేసుకుంటున్న భూములను కూడా సేకరించి ప్లాంటేషన్ చేపట్టారు. ఆహ్లాదం కోసం పూలు, పండ్ల మొక్కలు పెంచుతున్నారు. పనులన్నీ తుది దశకు చేరుకుని పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. పట్టణ ప్రజలతో పాటు సందర్శకులు కోరగుట్ట చుట్టూ సంచరించేలా, వాకింగ్ చేసేలా ట్రాక్ నిర్మించారు. గుట్టచుట్టూ ఒకసారి తిరిగితే 3.5 కి.మీ.నడిచినట్టవుతుంది. పార్క్‌లో సేద తీరేందుకు అందమైన గజీబులు(గుడిసెలను పోలిన ఇళ్లు), 40 సిమెంట్ బల్లలు, పచ్చగడ్డితో లాన్ ఏర్పాటు చేశారు. గుట్ట లోతట్టు ప్రాంతంలో చెక్ డ్యాంలు, చెరువు నిర్మించారు. భవిష్యత్‌లో ఈ చెరువులో బోటింగ్ ఏర్పాటు ప్రతిపాదన కూడా ఉంది.

వాచ్ టవర్ నిర్మాణం..

గతంలో కోరగుట్ట పైకి వెళ్లాలంటే రోడ్డు ఉండేది కాదు. కానీ మిషన్ భగీరథ పుణ్యాన ట్యాంక్ నిర్మాణ సమయంలో గుట్ట సగభాగం వరకు వాహనాలు వెళ్లేలా రహదారి ఏర్పాటు చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో గుట్ట వ్యూ పరిశీలనకు మూడంతస్తుల 'మచాన్'(వాచ్ టవర్) నిర్మిస్తున్నారు. ఆ టవర్ ఎక్కితే ఇల్లెందు పట్టణంతో పాటు చుట్టూ గల ప్రాంతాన్ని సందర్శించవచ్చు.



సేద తీరేందుకు నిర్మించిన గజీబు



పార్క్‌లో ఏర్పాటుచేసిన లాన్

మంత్రుల రాక కోసం..

కోరగుట్ట నేచర్ పార్క్ పనులు రెండేళ్లుగా సాగుతున్నాయి. అయితే ప్రస్తుతం రూ.60 లక్షల నిధులు మంజూరు కాగా పనులు తుది దశకు చేరాయి. పార్క్‌ను ప్రారంభించి మిగతా పనుల కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని అటవీశాఖ ఆరాటపడుతోంది. ప్రారంభోత్సవానికి మంత్రుల రాక కోసం ఎదురుచూస్తున్నారు.

హైలెట్‌గా నిలుస్తుంది



రానున్న కాలంలో ఇల్లెందు పట్టణానికి కోరగుట్ట నేచర్ పార్క్ హైలెట్‌గా నిలుస్తుంది. ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. గుట్ట చుట్టూ రక్షణ చర్యలు ముమ్మరం చేశాం. సందర్శకులకు ఆహ్లాదం, ఆనందం కలిగించే మరిన్ని పనులు చేయాలని చూస్తున్నాం. బోటింగ్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం.

– నాగేశ్వరరావు, ఎఫ్ఆర్వో, ఇల్లెందు

కోరగుట్ట అందాలు తిలకించేలా చేయాలి



నేచర్ పార్క్‌లోకి వెళ్లిన వారికి ఆహ్లాదంతో పాటు గుట్ట నుంచి పట్టణ అందాలు తిలకించేలా ఏర్పాట్లు చేయాలి. కోరగుట్టను పార్క్‌గా తీర్చిదిద్దటం ఆనందంగా ఉంది. కొన్ని వందల ఏళ్ల చరిత్ర ఉన్న కోరగుట్ట ఇలా ఉపయోగపడుందని అనుకోలేదు.

– ఎ.సతీష్ కాకతీయనగర్, ఇల్లెందు

అదనపు నిధులు సాధిస్తాం



కోరగుట్ట నేచర్ పార్క్ అభివృద్ధికి పలు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. మరిన్ని నిధులు రాబట్టేలా ప్రయత్నిస్తాం. పార్క్ అభివృద్ధితో ఇల్లెందుకు గుర్తింపు లభిస్తుంది. సెలవు రోజుల్లో కుటుంబ సమేతంగా పార్క్‌ను సందర్శించి ఆహ్లాదం పొందే అవకాశం ఉంటుంది.

-కె. వెంకన్న, ఎఫ్‌డీఓ

ఆశీర్వదిస్తే సేవ చేస్తా : షర్మిల



వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించాక కేక్ కట్ చేస్తున్న వైఎస్.షర్మిల

ఖమ్మంరూరల్: అందరూ ఆశీర్వదిస్తే పాలేరు ప్రజలకు సేవ చేస్తానని.. పాలేరులో వైఎస్సార్ తరహా సంక్షేమ పాలన అందించడమే తన లక్ష్యమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరి సమీపాన వైఎస్సార్‌టీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన వైఎస్ విగ్రహాన్ని శనివారం షర్మిల ఆవిష్కరించి మాట్లాడారు. వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రజల సంక్షేమానికి పాటుపడినందునే ప్రతీ ఇంట్లో దేవుడి ఫొటో పక్కన ఆయన ఫొటో పెట్టుకున్నారని తెలిపారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. వైఎస్సార్‌కు పాలేరుతో విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన హయాంలో రైతులకు మేలు జరిగిందని తెలిపారు. కాగా, 3,800 కి.మీ. మేర పాదయాత్ర చేసిన తాను ఈ నెలలో పాలేరులో మళ్లీ మొదలుపెట్టి 4వేల కి.మీ. యాత్రను ముగిస్తానని చెప్పారు. పాలేరు మట్టి సాక్షిగా గతంలో చెప్పినట్లు ఎల్లప్పుడూ ప్రజల కోసమే పనిచేసి.. వారి వెన్నంటి నిలుస్తానని షర్మిల తెలిపారు. అనంతరం వైఎస్ జయంతి ఏర్పాటుచేసిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కాగా, కొత్తూరులోని వైఎస్సార్‌టీపీ నాయకుడు తోట చిన్న వెంకటరెడ్డి స్వగృహంలో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లోనూ పాల్గొన్న షర్మిల కేక్ కట్ చేయగా, రిటైర్డ్ సీఐ, వైఎస్సార్‌టీపీ నాయకుడు మద్దెల ప్రసాద్ సతీమణి దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంక్షేమ ప్రదాత.. వైఎస్సార్

జిల్లా వ్యాప్తంగా మహానేత జయంతి వేడుకలు



బూర్గంపాడు : ముత్యాలమ్మపేటలో నివాళులర్పిస్తున్న పొంగులేటి, పొదెం వీరయ్య తదితరులు

అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రదాత.. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ పేదవాడి గుండెలో వైఎస్ కొలువై ఉన్నాడని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలతో ఎంతో మంది లబ్ధి పొందారని కొనియాడారు. తెలంగాణలో రాజన్న రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. – నెట్‌వర్క్

నేడు క్రీడాకారుల ఎంపిక

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ టీఆర్సీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు ఎంవీ.సుజీత్‌కుమార్, రాజ్‌కుమార్, హరిప్రసన్న తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్-11, 13, 15, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు సింగిల్స్ విభాగంలో రూ. 300, డబుల్స్‌లో రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, స్వామి వారి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాదానికి ఏపీలోని రాజమండ్రికి చెందిన అన్నపూర్ణ, శేషగిరిరావు రూ.1.10 లక్షలు వితరణగా అందజేశారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కార్మిక శాఖ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకుని ఉపాలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందజేయగా, ఈఓ రమాదేవి శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందించారు. టీఎస్‌జీఓస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ గౌడ్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, అసోసియేట్ అధ్యక్షుడు రామనరసయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరబాబు, భద్రాచల యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు డెక్క నరసింహారావు గగ్గురి బాలకృష్ణ, ట్రెజరీ పడిగ నరసింహారావు అంజిబాబు, భాస్కర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



రాణి కుముదినిని సత్కరిస్తున్న ఆలయ ఈఓ రమాదేవి

కిన్నెరసానిలో..

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని శనివారం కార్మిక శాఖ చీఫ్ సెక్రటరీ రాణి కుముదిని సందర్శించారు. డీర్ పార్కులోని దుప్పులను, జలాశయాన్ని వీక్షించిన తర్వాత రిజర్వాయర్‌లో బోటింగ్ చేశారు.

క్లుప్తంగా

తోగ్గూడెం క్వారీల్లో సీఐ తనిఖీ


క్వారీలో తనిఖీ చేస్తున్న సీఐ వినయ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: తోగ్గూడెం క్వారీల్లో అనుమతి లేకుండా శక్తివంతమైన పేలుడు పదార్థాలతో పేల్చేస్తున్న నేపథ్యంలో 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలకు సీఐ వి.వినయ్‌కుమార్ స్పందించారు. శనివారం ఆయన రూరల్ ఎస్సై ఎం.శ్రీనివాసరావుతో కలిసి క్వారీలను తనిఖీ చేశారు. క్వారీల యజమానులు ఎవరు, బినామీలు ఎవరు, వారిలో ఎంతమందికి అనుమతులు ఉన్నాయి తదితర వివరాలు ఆరా తీశారు. నిర్వాహకులతో సమావేశం నిర్వహించి తనకు నివేదిక ఇవ్వాలని ఎస్సైని ఆదేశించారు.

కూలీలను అడ్డుకున్న పంచాయతీ కార్మికులు


రోడ్డుపై బైఠాయించిన పంచాయతీ కార్మికులు, నాయకులు

అశ్వాపురం: గత మూడు రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మెతో మండల కేంద్రంలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దీంతో సర్పంచ్ బానోత్ శారద, ఉప సర్పంచ్ చందూలాల్ ఆధ్వర్యాన గౌతమీనగర్ కాలనీ ఎదుట కూలీలతో చెత్తా చెదారం తొలగిస్తున్నారు. ఈక్రమంలో సమ్మెలో ఉన్న మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు, ఎంపీపీ ముత్తినేని సుజాత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీను, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు కూలీలను అడ్డుకున్నారు. కాగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ.. దుర్వాసన వస్తుండటంతో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా కూలీలతో చెత్తను తొలగిస్తున్నామే తప్ప పంచాయతీ కార్మికులకు మేము వ్యతిరేకం కాదని చెప్పారు.

కోడిపుంజుల వాగుపై వంతెన ప్రారంభం


వంతెనను ప్రారంభిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరు రూరల్: సింగరేణి మణుగూరు ఏరియాలోని కూనవరం రైల్వేగేట్ ప్రాంతంలో కోడిపుంజుల వాగుపై రూ.80లక్షల వ్యయంతో పునర్నిర్మించిన వంతెనను ఏరియా జీఎం దుర్గం రాంచందర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలోని అధికారులు, కార్మికులు, ప్రజల సౌకర్యార్థంవంతెన నిర్మించినట్లు తెలిపారు. అధికారులు ఈసం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, వెంకట్రావు, శ్రీనివాసమూర్తి, శేష గిరిరావు, రాజేంద్రప్రసాద్, ప్రవీణ్, సింగు శ్రీనివాస్, రామేశ్వరరావుతో పాటు టీబీజీకేఎస్ నాయకుడు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

11న 'సీత్లా భవానీ' వేడుకలు

ఖమ్మంఅర్బన్: బంజారాల(గిరిజనుల) ప్రకృతి పండుగ అయిన సీత్లా భవానీ వేడుకలను ఈనెల 11న ప్రతీ తండాలో నిర్వహించనున్నట్లు అఖిల భారత గిరిజన సంఘం నాయకుడు బానోత్ గోపి తెలిపారు. ఏటా ఆషాఢ మాసంలో ఈ పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్


చెట్ల పొదల్లో ట్రాక్టర్

ఇల్లెందురూరల్: మామిడిగూడెంలో పొలం దున్నేందుకు వెళ్లిన ఓ ట్రాక్టర్ అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పోలారం గ్రామపంచాయతీ భద్రుతండాకు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ రామా ఇల్లెందు–గుండాల ప్రధాన రహదారిలో పొలం దున్నేందుకు వస్తుండగా మామిడిగూడెం సమీపాన శనివారం ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనే చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళా కూలీలు, డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కాగా సమీప ప్రాంత ప్రజలు వారికి సహకరించి సురక్షితంగా బయటకు చేర్చారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

యథేచ్ఛగా విద్యుత్ చౌర్యం..

జిల్లాలో 4.25 లక్షల విద్యుత్ కనెక్షన్లు...
- పెరుగుతున్న అక్రమ విద్యుత్ వాడకం
- కేసులు నమోదవుతున్నా.. మారని విద్యుత్ వినియోగదారుల తీరు
- ఆరు నెలల్లో 1,781 కేసులు నమోదు


తనిఖీలు నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: దొరికితే దొంగ లేకపోతే దొర అన్న చందంగా జిల్లాలో కొంతమంది విద్యుత్ వినియోగదారుల తీరు కనిపిస్తోంది. విద్యుత్‌శాఖ అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా.. పూర్తిస్థాయిలో విద్యుత్ చౌర్యాన్ని అరికట్టలేకపోతున్నారు. దాడులు చేసేలోగా జరగాల్సింది జరిగిపోతోంది. దీంతో అనధికారిక వినియోగం కారణంగా డిమాండ్‌కు మించి విద్యుత్ సరఫరా చేయాల్సి వస్తోంది. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే కొంతమంది విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా జరిమానా పూర్తిస్థాయిలో వసూళ్లు కావడంలేదు. పేదలు నెలవారి విద్యుత్ బిల్లు చెల్లించపోతేనే విద్యుత్ కనెక్షన్ తీసేస్తున్న సిబ్బంది.. అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ సంస్థకు భారీగా నష్టం..
అక్రమార్కుల చర్యలతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నానాటికి చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారులు భారీగా బయటపడుతున్నారు. జిల్లాకు చెందిన విద్యుత్ సిబ్బంది ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా అనుమానం ఉన్న దుకాణాలు, నివాసాలపై దాడులు నిర్వహిస్తూ మీటర్లను తనిఖీ చేస్తున్నారు. ఇందులో పదుల సంఖ్యలో టాంపరింగ్ చేసినట్లు తేలగా.. మీటర్లు సీజ్ చేసి వినియోగదారులకు జరిమానాలు విధిస్తున్నారు. వీటిలో ఇంట్లో వ్యక్తులే ఎక్కువగా ఈ మీటర్ టాంపరింగ్ పాల్పడుతుండడం గమనార్హం. ఇలా టాంపరింగ్ చేస్తున్న అక్రమార్కులపై ప్రస్తుతం జరిమానా, సివిల్ కేసు నమోదుతో సరిపెడుతున్న శాఖ భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కఠిన శిక్షలు విధించాల్సిన అవసరముంది. టాంపరింగ్ చేయించినట్లు అనుమానం ఉన్న మీటరు వినియోగదారుడి ఎదుటే టెక్నికల్ సిబ్బంది పరీక్షిస్తుండడం విశేషం.

జిల్లా వ్యాప్తంగా జరిగిన కొన్ని సంఘటనలు..
- భద్రాచలం పట్టణంలోని ఆదర్శనగర్‌లో ఇంట్లో మీటర్ టాంపరింగ్ చేసినట్లు తేలడంతో అధికారులు రూ.25 వేలు జరిమానా విధించారు.
- భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో గల ఓ ఇంట్లో నెల నెల వస్తున్న బిల్లుపై అనుమానం రావడంతో విద్యుత్ శాఖ అధికారులు మీటర్‌ను తనిఖీ చేయగా.. టాంపరింగ్ చేసినట్లు బయటపడింది. దీంతో రూ.30 వేలు జరిమానా విధించారు.
- బూర్గంపాడు మండలంలోని సారపాక పరిధిలో గల మసీద్ రోడ్డులో గల ఓ ఇంట్లో మీటర్ టాంపరింగ్ చేస్తున్నట్లు అధికారుల గుర్తించి తనిఖీలు నిర్వహించి నిర్ధారించి రూ.66 వేలు జరిమానా విధించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒక్కాడ జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ వినియోగదారుల్లో మార్పు రావడంలేదు. ఇలాంటి ఘటనలపై అధికారులు వినియోగదారులకు అవగాహన కల్పించాల్సి అవసరం ఎంతైనా ఉంది.


టాంపరింగ్ చేసిన విద్యుత్ మీటర్ (ఫైల్)

పసిగట్టిన ప్రతీది..
తనిఖీల్లో భాగంగా విద్యుత్‌శాఖ(విజిలెన్స్ విభాగం) అధికారులు పసిగట్టిన ప్రతీ వినియోగదారుడి మీటరు టాంపరింగ్‌కు పాల్పడినట్లు తేలుతుండటం చూస్తే జిల్లా వ్యాప్తంగా భారీగా అక్రమాలు ఉన్నట్లు అనుమానం వస్తోంది. విద్యుత్ వాడకం ఎక్కువగా ఉన్న దుకాణాలన్నీ బిల్లు తక్కువగా వచ్చేలా అక్రమ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. టాంపరింగ్ జరిగిన మీటర్లను వెంటనే సీజ్ చేసి టెక్నికల్ విభాగానికి తరలించి వినియోగం తీరును బట్టి జరిమానా విధిస్తున్నారు.

పెరిగిన అక్రమ వాడకం..
విద్యుత్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా కొందరు, టాంపరింగ్‌కు పాల్పడుతున్న మరికొందరు, విద్యుత్‌శాఖ నుంచి అనుమతి పొందినా దానికంటే అధిక మొత్తంలో కరెంట్‌ను వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు విద్యుత్ శాఖలో ప్రత్యేకంగా విజిలెన్స్ టీం ఒకటి ఉంది. ఈ టీం సభ్యులు జిల్లాలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యుత్‌ను అక్రమంగా వినియోగించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. సాధారణంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే మొదటిసారి విద్యుత్ చట్టం-2003 సెక్షన్ 135 ప్రకారం జరిమానా విధిస్తారు. అదే వ్యక్తి మరోసారి చౌర్యానికి పాల్పడితే కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తారు. అంతేకాక 10 రెట్లు అధికంగా జరిమానా విధిస్తారు. ఇతర కేసులకు సంబంధించి వారి నెలవారీ బిల్లులో జరిమానాకు మొత్తాన్ని కలిపి వసూలు చేస్తారు.

4.25 లక్షల విద్యుత్ కనెక్షన్లు...
జిల్లాలో మొత్తం 4,25,347 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో 3,27,956 గృహ వినియోగం; 37,973 వాణిజ్యపరం; 1,598 పరిశ్రమలు; 397 కుటీర పరిశ్రమలు; 49,030 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. దీంతో పాటు 3,771 వీధి దీపాలు; 1,756 నీటి పనులు; జనరల్ వాడకాలు (వివిధ టెంపుళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు); 239 తాత్కాలిక అవసరాలకు; 5 విద్యుత్ ద్వారా చార్జింగ్ అయ్యే వాహనాలతో పాటు 190 హై ఓల్టేజ్ వినియోగించేందుకు తీసుకునే విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

1,781 కేసులు.. రూ.32.74 లక్షల జరిమానా
జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి జూన్ వరకు 1,781 మందిపై కేసులు నమోదు చేశారు. జనవరిలో 364, ఫిబ్రవరిలో 304, మార్చిలో 288, ఏప్రిల్‌లో 292, మేలో 268, జూన్‌లో 265 మందిపై కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసులపై రూ.32.74 లక్షల జరిమానా విధించారు.

జరిమానా చెల్లించాల్సిందే..



జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి జూన్ వరకు 1,781 మీటర్లు టాంపరింగ్‌కు పాల్పడినట్లు తెలిసింది. వాటిని ప్రత్యేక సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నాం. వీటితో పాటు అనుమానం ఉన్న ప్రతీ మీటర్‌ను పరీక్షిస్తాం. జరిమానా చెల్లించాల్సిందే.. ఉపేక్షించేది లేదు. ఆలస్యం చేస్తే సరఫరాను పూర్తిగా నిలిపివేస్తాం. – రమేశ్, విద్యుత్ శాఖ ఎస్ఈ, భద్రాద్రి కొత్తగూడెం

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం..



విద్యుత్ అక్రమ వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఇప్పటికే భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా అక్రమంగా విద్యుత్ వాడుతున్న వారిపై కేసులు నమోదు చేశాం. వారినుంచి పూర్తిస్థాయిలో జరిమానా వసూలు చేస్తాం. విద్యుత్‌ను అక్రమంగా వినియోగించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. – జీవన్‌కుమార్, డీఈ, భద్రాచలం

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


శివలాల్(ఫైల్)

టేకులపల్లి: మనస్తాపంతో ఉరివేసుకుని యువకుడు బలవన్మరణం పొందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోలియాతండా పంచాయతీ తడికలపూడి రోడ్డు గ్రామానికి చెందిన భూక్య శివలాల్ (28) ప్రైవేట్‌గా పశువైద్యం చేస్తుంటాడు. తల్లి బుజ్జి ఇటీవల కూతురు ఇంటికి వెళ్లగా.. శనివారం తండ్రి, తమ్ముడు లేని సమయంలో ఇంటి వెనకాల రేకుల షెడ్డులో శివలాల్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొలం పనుల నుంచి ఇంటికి వచ్చిన తండ్రి చూసే సరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వారు వచ్చి పరిశీలించే సరికి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఎస్ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఇదిలా ఉండగా గతంలోనూ రెండు సార్లు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడినట్లు తెలిసింది. మూడు రోజుల క్రితం రామాలయానికి కూడా వెళ్లి పూజ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. శనివారం ఉదయం తాను ఆత్మహత్య చేసుకుంటానని సెంటర్‌లో పలువురితో మాట్లాడినట్లు తెలిసింది. గ్రూప్–4, కానిస్టేబుల్ పరీక్షలు రాసినా శివలాల్ ఆ ఉద్యోగాలు వస్తాయో లేదోననే మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి భద్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అతివేగమే కారణమా..?

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి
- 15 మందికి తీవ్రగాయాలు
- రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు


మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులు


డ్రైవర్ మృతదేహం

అశ్వాపురం: మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై వెళ్తున్న ఓ లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంచికంటినగర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. కాగా, ఈ రోడ్డు ప్రమాదంపై శనివారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. వరంగల్-2 డిపోకు చెందిన టీఎస్03జెడ్ 0471 నంబర్ గల ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి విజయవాడ వైపు వెళ్తోంది. ఈక్రమంలో అశ్వాపురం గ్రామ సమీపంలో మంచికంటినగర్ వద్ద కోదాడ నుంచి బీజాపూరు వెళ్తున్న టీఎస్29టీ 6479 నంబర్ గల లారీని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జనగాం జిల్లా కొడకండ్ల మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కునుసోత్ భీమ్(55) అక్కడికక్కడే మృతి చెందగా 15మందికి తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న అశ్వాపురం ఎస్ఐ సురేష్ పోలీస్ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లు, పోలీస్ వాహనంలో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయాన బస్సులో 30 మందికి పైగా ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. అందులో తీవ్ర గాయాలైన 15 మందిలో నలుగురికి హైదరాబాద్ తరలించారు. ఈమేరకు మణుగూరుకు చెందిన బస్సు ప్రయాణికుడు సరెడ్డి శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతి వేగంతో లారీని ఢీకొట్టడంతో మృతిచెందాడని ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్ భీమ్ మృతదేహానికి మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

20 కేజీల గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

భద్రాచలంఅర్బన్: గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.4లక్షలు విలువ చేసే 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం టౌన్ సీఐ నాగరాజురెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పోలీసులు శనివారం బ్రిడ్జి సెంటర్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్నారు. ఈనేపథ్యాన ఆ ద్విచక్ర వాహనాన్ని ఆపి వివరాలు అడుగగా.. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. దీంతో 20కేజీల గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. మల్కాన్‌గిరికి చెందిన రాజా బిసారి, రాజేష్ విశ్వాస్‌లు ఒరిస్సా ప్రాంతంలో గంజాయిని కొని హైదరాబాద్‌లో విక్రయించేందుకు భద్రాచలం మీదుగా తరలిస్తూ పట్టుబడినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై ఆ నలుగురు !


వేదికపై కూర్చున్న నలుగురు ఆశావహులు

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నలుగురు నేతలు ఒకే వేదికపై కలుసుకున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా శనివారం దమ్మపేటలో నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, పొంగులేటి అనుచరుడు జారే ఆదినారాయణ, ములకలపల్లి జెడ్పీటీసీ సున్నం నాగమణి, వగ్గెల పూజ కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నలుగురూ కలసి కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు మాట్లాడుతూ.. టికెట్ ఎవరికి వచ్చినా అంతా కలసి పనిచేయాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, అత్తులూరి వెంకటరామారావు, పానుగంటి సత్యం, చిన్నశెట్టి యుగంధర్, యర్రగొర్ల రాధాకృష్ణ, రావు రవిశంకర్, శ్రీరాముల ప్రసాద్, పర్వతనేని ప్రసాద్, చామర్తి గోపి శాస్త్రి, సాయిల నర్సీ, చక్రాల మల్లేశ్వరరావు, చిన్నశెట్టి చిట్టిబాబు, కందుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మోదీ పాలనలో అడుగడుగునా అన్యాయం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని


జీపీ కార్మికుల సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): ప్రధాని మోదీ పాలనలో తెలంగాణకు అడుగడుగునా అన్యాయం జరిగిందని.. బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తూ తెలంగాణపై వివక్ష చూపుతున్నారని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. విభజన హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ శనివారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మభ్యపెట్టేందుకు వరంగల్‌లో శంకుస్థాపనలు చేశారని ఆరోపించారు.

కార్మికుల సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి..
చుంచుపల్లి: రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి డిమాండ్లు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నిరసన శిబిరాన్ని కూనంనేని సందర్శించి మాట్లాడారు. కనీస వేతనాల అమలు, పనిభద్రత, అర్హులకు పదోన్నతులు కల్పించే విషయంలో ప్రభుత్వం స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషాతో పాటు సీపీఐ నాయకులు, కార్మిక జేఏసీ నాయకులు బండెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, వై.శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాలపాటి శేషయ్య, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, గోవింద్, సలిగంటి శ్రీనివాస్, కె.రత్నకుమారి, పోలమూరి శ్రీనివాస్, అమర్, కిషోర్, సురేష్, బండ రామకృష్ణ, ప్రవీణ్, సలీం, వెంకన్న, ఆదిలక్ష్మి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ మొక్కలను ధ్వంసం చేసిన ఇద్దరిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడేనికి చెందిన నార్లపాటి దేవికి చెందిన పొలంలో పామాయిల్ మొక్కలు వేశారు. ఈక్రమంలో ఇదే పంచాయతీకి చెందిన నార్లపాటి సుదర్శన్, తగరం సోమరాజు అనే వ్యక్తులు ఆ మొక్కలను ధ్వంసం చేసినట్లు బాధితురాలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీంతో వారిరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనపై..
భద్రాచలంఅర్బన్: పట్టణంలో జంగాల కాలనీ చర్ల రోడ్డుకు చెందిన జంపయ్యను సాయి అనే వ్యక్తి అకారణంగా దాడి చేశాడని శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు సాయిపై కేసు నమోదు చేశారు.

ప్లాంటేషన్ ధ్వంసంపై..
చండ్రుగొండ : మండలంలోని చండ్రుగొండ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మద్దుకూరు సెక్షన్ బెండాలపాడు ఉత్తరబీట్ పరిధిలో ఉన్న ప్లాంటేషన్‌లో మారుజాతి మొక్కలను ధ్వంసం చేసిన వారిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు. మద్దుకూరు, బాలికుంట గ్రామాలకు చెందిన గిరిజన, గిరిజనేతరుల ప్లాంటేషన్‌లోని 1,110 మొక్కలను పీకేశారని పేర్కొన్నారు. బెండాలపాడు బీట్ అధికారి స్వాతి ఫిర్యాదు మేరకు 18 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రహరీ గోడ నిర్మిస్తున్న వ్యక్తిపై..
అశ్వారావుపేటరూరల్: ఓ మహిళకు చెందిన స్థలంలో ప్రహరీ గోడ నిర్మిస్తున్న వ్యక్తిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడేనికి చెందిన నార్లపాటి నాగపద్మ అనే మహిళ తన స్థలంలో, ఇదే గ్రామానికి చెందిన తగరం రామారావు అనే వ్యక్తి అక్రమంగా ప్రహరీ గోడ నిర్మిస్తున్నాడు. ఈక్రమంలో బాధితురాలు రామారావుపై ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యంపై..
అశ్వారావుపేటరూరల్: ఓ యువతి కనిపించకపోవడంతో శనివారం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని రామన్నగూడేనికి చెందిన కె.కల్యాణి(20) గురువారం రాత్రి ఇంట్లో నిద్రించి.. తెల్లవారే సరికి కనబడలేదు. దీంతో యువతి తండ్రి శ్రీరామ్మూర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త వేధిస్తున్నాడని..
అశ్వారావుపేటరూరల్: భార్యను వేధిస్తున్న భర్తపై శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామన్నగూడేనికి చెందిన వేముల మౌనికకు, ములకలపల్లి మండలంలోని రాజుపేట కాలనీకు చెందిన వేముల శ్రీనుకు 2010 సంవత్సరంలో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. కాగా, గడిచిన కొద్ది రోజులుగా శ్రీను మద్యం సేవించి భార్యను వేధింపులకు గురి చేస్తుండడంతో భరించలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై దాడి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలోని గడ్డం సుధాకర్‌కు చెందిన ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఆ సెంటర్‌లో ఉన్న బోర్డులు, కుర్చీలు ధ్వంసం చేశారు. కొందరు వ్యక్తులు కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ధ్వంసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.